


# కెరటం న్యూస్

(సామాన్యుడి ఆయుధం)




Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 04 సంచిక :181 | శుక్రవారం 04 జులై 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695

## ఎవరికీ భయపడేది లేదు

### : కొండా మురళి



- చాలా కేసులకే భయపడలేదు, ప్రజాబలం నాతో ఉంది
- బీసీ కార్డు పట్టుకుని ప్రజల కోసం పనిచేస్తున్నా
- పార్టీ టికెట్లెవరికిచ్చినా గెలిపించే బాధ్యత నాది
- సుష్మిత రాజకీయ ఆలోచనల్లో తప్పు లేదు, నిర్ణయానికి ఆమెకే అధికారం – కొండా సురేఖ
- వివాదాస్పద వ్యాఖ్యలపై షోకాజ్ నోటీసు అందుకున్న కొండా మురళి

న్యూస్ డెస్క్,03 జులై (కెరటం న్యూస్): తాను వెనుకబడిన వర్గాల ప్రతినిధిని అని కాంగ్రెస్ నేత కొండా మురళి అన్నారు. తన సతీమణి, మంత్రి కొండా సురేఖతో కలిసి ఆయన హైదర్‌గూడలోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌తో భేటీ అయ్యారు.

## నన్ను డమ్మీ అన్నవాళ్లకు డాడీ అవుతా

### : తెలంగాణ బీజేపీ స్టేట్ చీఫ్



న్యూస్ డెస్క్,03 జులై (కెరటం న్యూస్): తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. గురువారం ఆయన ఓ మీడియా ఛానల్ ప్రతినిధితో మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్ష పదవి అనేది కిరీటం కాదని.. బాధ్యత అని అన్నారు. బీఆర్ఎస్ ట్విట్టర్ పార్టీ దానితో ఎవరికీ ఉపయోగం లేదని.. మా పోటీ ఎప్పుడూ కాంగ్రెస్‌తోనే అని అన్నారు. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల మీద ఫోకస్ పెట్టాం.. వీలైనన్నీ ఎక్కువ సీట్లు సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

## ఢిల్లీలో దారుణం.. తిట్టారన్న కోపంతో..

### యజమానురాలు, ఆమె కుమారుడిపై హత్యాకాండ!

న్యూస్ డెస్క్,03 జులై (కెరటం న్యూస్): దేశ రాజధాని ఢిల్లీలో దారుణం జరిగింది. తిట్టారన్న కోపంతో ఇంటి యజమానురాలిని, ఆమె చిన్న కుమారుడిని అత్యంత దారుణంగా పని మనిషి చంపేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిని అరెస్ట్ చేశారు.



## బనకచర్లపై రాహుల్ గాంధీ మౌనం కుట్రపూరితమే - కేటీఆర్



న్యూస్ డెస్క్,03 జులై (కెరటం న్యూస్): బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం గురించి రాహుల్ గాంధీ మౌనం వహించడం కుట్రపూరితమే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కేటీఆర్ తన సోషల్ మీడియా పోస్టులో... లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడిగా ఏడాది పూర్తి చేసుకుంటున్న తరుణంలో రాహుల్ రాష్ట్ర ప్రజలకు చేసిన ద్రోహం తీవ్రరూపం దాల్చిందని పేర్కొన్నారు.




## ఐటీనే కాదు.. బంగారం అన్నా

# ఇక హైదరాబాద్ సిటీనే

- మలబార్ గోల్డ్ యూనిట్ ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి
- మహేశ్వరం నాలుగో ఫ్యూచర్ సిటీగా అభివృద్ధి
- తెలంగాణ పారిశ్రామిక పాలసీలు 30 ఏళ్లుగా స్థిరంగా కొనసాగుతున్నాయి - పెట్టుబడిదారులకు భరోసా
- తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ డిసెంబర్ 9న విడుదల - రాబోయే వందేళ్ల దిశగా ప్రణాళిక
- చంద్రబాబు, వైఎస్ నిర్మించిన సైబరాబాద్ తర్వాత నాలుగో నగరానికి కాంగ్రెస్ సిద్ధం
- పెట్టుబడులు మాత్రమే కాదు.. లాభాలు కూడా వస్తాయన్న భరోసా
- హైదరాబాద్‌ను ప్రపంచ పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దుతాం -సీఎం రేవంత్ రెడ్డి



న్యూస్ డెస్క్,03 జులై (కెరటం న్యూస్): గురువారం మలబార్ జెమ్స్ అండ్ జ్యువెలరీ తయారీ యూనిట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఒక్కో రంగంలో హైదరాబాద్ సిటీ అభివృద్ధిలో పరిశ్రమల్లో దూసుకుపోతోందని అన్నారు. హైదరాబాద్ అంటే ఐటీనే కాకుండా బంగారానికి కూడా ఇకపై హైదరాబాద్ బ్రాండ్ కానుందని అన్నారు. హైదరాబాద్ అంటే ఐటీనే కాకుండా ఫార్మా, రియల్ ఎస్టేట్, బల్క్ డ్రగ్స్ లోనూ హైదరాబాద్ సిటీ తన ప్రత్యేకతను చాటుకుందని.. ఇప్పుడు మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ మ్యానిఫ్యాక్చరింగ్ యూనిట్ హైదరాబాద్ లో రావటం అనేది శుభ పరిణామని అన్నారు.

## కేసీఆర్ తోనే లెక్క.. వేరే వాళ్ళతో పని లేదు

### : మంత్రి కోమటిరెడ్డి



న్యూస్ డెస్క్,03 జులై (కెరటం న్యూస్): రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల కేసీఆర్ పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రోడ్ల అభివృద్ధి, పనుల పురోగతిపై ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడరు. ఈ సందర్భంగా కేసీఆర్‌ను ఉద్దేశిస్తూ.. 'కేసీఆర్ అసెంబ్లీకి రావాలి, ఆయన వస్తే ఆ పార్టీ నేతలు కోరుతున్నట్టు అన్ని అంశాలపై చర్చ జరుపుతాం' అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులైన హరీష్ రావు, కేటీఆర్‌లతో తమకు సంబంధం లేదని, వారు 'లెక్కలోకి కూడా రారు' అని వ్యాఖ్యానించారు.

## ఐటీ కారిడార్‌లో బోనాల జాతర..

- శిల్పకళా వేదిక నుంచి దేవస్థానానికి శోభాయాత్ర..!



## మంత్రి ఆదేశాలతో నిధులు విడుదల


### ఏసీబీ విచారణలో ఐఏఎస్ అరవింద్..



న్యూస్ డెస్క్,03 జులై (కెరటం న్యూస్): ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో ఏసీబీ విచారణకు ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ హాజరయ్యారు. జూన్ 16వ తేదీన మాజీ మంత్రి కేటీఆర్ స్టేట్మెంట్ ఆధారంగా అరవింద్ కుమార్ ను విచారణ చేసింది. ఈ కేసులో ఏ2గా అరవింద్ కుమార్, ఏ1గా కేటీఆర్ ఉన్నారు.

## గ్రూప్-1 పిటిషన్లలో ఆరోపణలు అవాస్తవం

### హైకోర్టులో టీజీపీఎస్సీ వాదనలు



న్యూస్ డెస్క్,03 జులై (కెరటం న్యూస్): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) గ్రూప్-1 పిటిషన్లపై తెలంగాణ హైకోర్టులో విచారణ కొనసాగుతోంది. భోజన విరామం అనంతరం టీజీపీఎస్సీ తరపున సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు.

## చంద్రబాబుతో చెట్టాపట్టాల్ వేసుకుని బనకచర్లకు ఒప్పుకుంది మీరు కాదా..?



- ఖర్గే పర్యటన: సామాజిక న్యాయ సమరా భేరి సభకు ఏర్పాట్లు పూర్తి
- చంద్రబాబుతో చెట్టాపట్టాలు వేసుకుని బనకచర్ల ఒప్పందం చేసినది బీఆర్ఎస్ కాదా?
- బీజేపీలో బీసీలకు ప్రాధాన్యం లేదు, బీసీలకు న్యాయం చేసే ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమే
- ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి వ్యాఖ్యలపై తీవ్రంగా పరిగణిస్తున్నాం – పార్టీ క్రమశిక్షణ తప్పనిసరి అని హెచ్చరిక

## జీపీఓలకు అతి త్వరలోనే నియామక పత్రాలు

### రెవెన్యూ ఉద్యోగ సంఘాలతో సీసీఎల్ఏ సమావేశం

### రెవెన్యూ జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి



హైదరాబాద్ బ్యూరో,03 జులై (కెరటం న్యూస్): రాష్ట్రంలో అతి త్వరలోనే గ్రామ పరిపాలన అధికారుల(జీపీఓ) కు నియామక పత్రాలను అందజేసి విధుల్లోకి తీసుకోనున్నారని రెవెన్యూ జేఏసీ చైర్మన్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికే జీపీఓ నియామకం కోసం పరీక్ష రాసి అర్హత సాధించిన 3,454 మందికి మొదటి విడతలో ఈ అవకాశం దక్కుతుందన్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ, సీసీఎల్ఏ లోకేష్ కుమార్ గురువారం రెవెన్యూ ఉద్యోగ సంఘాలైన డిప్యూటీ కలెక్టర్ల సంఘం, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి ప్రిన్సిపల్ సెక్రటరీ, సీసీఎల్ఏ లోకేష్ కుమార్ దృష్టికి పలు విషయాలను తీసుకెళ్లారు.

# ఐటీనే కాదు.. బంగారం అన్నా ఇక హైదరాబాద్ సిటీనే : సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి

పెట్టుబడులు తీసుకురావటమే కాకుండా పారిశ్రామికవేత్తలకు మంచి అనువైన వాతావరణం కూడా తెలంగాణలో ఉందని అన్నారు సీఎం రేవంత్. ఇండస్ట్రియల్, ఇన్వెస్ట్ మెంట్ పాలసీలు గత 30 ఏళ్లుగా స్థిరంగా కొనసాగుతున్నాయని.. ప్రభుత్వాలు మారినా వాటిలో మార్పు లేకుండా మరింత మెరుగ్గా ముందుకు తీసుకెళ్లినట్లు వివరించారు సీఎం రేవంత్. హైదరాబాద్ లో నాలుగో నగరం నిర్మాణం దిశగా అడుగులు వేస్తున్నామని.. మహేశ్వరం ప్రాంతం నాలుగో నగరం అభివృద్ధి చెందుతుందని అన్నారు.



నాడు కులీ కుదుబ్ షాహీలు హైదరాబాద్ సిటీని నిర్మిస్తే..నిజాం నవాబులు హైదరాబాద్, సికింద్రాబాద్ నిర్మించారని అన్నారు.ఆ తర్వాత చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డిలు సైబరాబాద్ మూడో సిటీని నిర్మించారని.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించబోతుందని అన్నారు సీఎం రేవంత్. మహేశ్వరంలో నియోజకవర్గం పరిధిలో 30 వేల ఎకరాలతో ప్రపంచంలోని అధునాతమైన నగరం నిర్మాణం కాబోతోందని అన్నారు సీఎం రేవంత్.

తెలంగాణలో హైదరాబాద్ ను ప్రపంచ పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని.. మలబార్ తయారీ యూనిట్ ను మహేశ్వరంలో ఏర్పాటు చేయడం సంతోషమని అన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ ను డిసెంబర్ 9న ఆవిష్కరించబోతున్నామని.. రాబోయే వందేళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని విజన్ డాక్యుమెంట్ ను రూపొందిస్తున్నామని అన్నారు సీఎం రేవంత్.

ప్రభుత్వాలు మారినా మన పారిశ్రామిక పాలసీలను మార్చుకోలేదని.. పెట్టుబడులకు మెరుగైన అవకాశాలు కల్పిస్తూ ముందుకు వెళుతున్నామని అన్నారు. పెట్టుబడులను ఆకర్షించడమే కాదు.. వారికి లాభాలు చేకూరేలా రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని స్పష్టం చేశారు సీఎం రేవంత్. తెలంగాణపై నమ్మకం ఉంచిన మలబార్ గ్రూప్ కు అభినందనలు తెలుపుతున్నానని అన్నారు సీఎం రేవంత్.

# ఎవరికీ భయపడేది లేదు : కొండా మురళి

మొదటి పేజీ తరువాయి

ఉమ్మడి వరంగల్‌లో జరుగుతున్న అంశాలపై ఆమెకు నివేదిక ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. “ఒకరి గురించి నేను కామెంట్ చేయను. నాకు ప్రజాబలం ఉంది. చాలా కేసులకే నేను భయపడలేదు.. భయం లేదని ముందు నుంచీ చెబుతూనే ఉన్నా.



**పేదల సమస్యలు పరిష్కరిస్తాం కాబట్టే జనం నా దగ్గరికి వస్తారు**

నేను బీసీ కార్డు పట్టుకునే బతుకుతున్నా. పేదల సమస్యలు పరిష్కరిస్తాను కాబట్టే జనం నా దగ్గరికి వస్తారు. పనిచేసే వారిపైనే కొందరు రాళ్లు వేస్తారు. నడిచే ఎద్దునే పొడుస్తారు. పార్టీ ఎవరికి టికెట్లు ఇచ్చినా గెలిపించే బాధ్యత నేను తీసుకుంటానని మీనాక్షి నటరాజన్‌తో చెప్పా. మా సేవల్ని పార్టీ ఉపయోగించుకోవాలని కోరా. కాంగ్రెస్ పార్టీని బతికించడమే నా ఉద్దేశం. రాహుల్ గాంధీని ప్రధాని చేయడం నా లక్ష్యం. రేవంత్‌రెడ్డిని ఇంకో పదేళ్లు ముఖ్యమంత్రిగా చూడాలి. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌కు అండగా నిలుస్తా.

శుక్రవారం జరగబోయే సభపై చర్చించాం. వరంగల్ నుంచి ఎంత మంది వస్తారనే అంశంపై మాట్లాడాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచేలా కృషి చేస్తా. ఎమ్మెల్యేలను మళ్లీ వరంగల్‌లో గెలిపించడమే నా బాధ్యత. నేను ఎవరికీ భయపడేది లేదు. ఎలాంటి గ్రూపు రాజకీయాలతో నాకు సంబంధం లేదు” అని కొండా మురళి తెలిపారు.

**సుష్మిత రాజకీయ ఆలోచనలను తప్పు పట్టలేం: కొండా సురేఖ**

తనకు ఇచ్చిన శాఖలకు న్యాయం చేస్తున్నానని మంత్రి కొండా సురేఖ అన్నారు. “నిబంధనల ప్రకారమే పని చేస్తున్నాను. నా శాఖలో ఉన్న ఫైల్స్ అన్నీ పరిశీలించుకోవచ్చు. మంత్రిగా ఇప్పటివరకు ఎలాంటి తప్పులు చేయలేదు. సుష్మితలో పారేది కొండా మురళి, కొండా సురేఖ రక్తం. ఆమెకు మా ఆలోచనలు వంశపారంపర్యంగా రావడంలో తప్పు లేదు. సుష్మిత రాజకీయ ఆలోచనలను తప్పు పట్టలేం. భవిష్యత్తు ఎలా ప్లాన్ చేసుకోవాలో నిర్ణయించే అధికారం ఆమెకు ఉంది. పార్టీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూస్తాం.” అని కొండా సురేఖ అన్నారు.

ఇటీవల ఓ కార్యక్రమంలో వరంగల్‌లోని నేతలను ఉద్దేశించి కొండా మురళి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆయన్ను ఇటీవల పీసీసీ క్రమశిక్షణ కమిటీ.. గాంధీ భవన్‌కు పిలిచి వివరణ అడిగింది. దీనిపై లిఖిత పూర్వక వివరణ కోసం మళ్లీ షోకాజ్ నోటీసు కూడా ఇచ్చింది.

# కేసీఆర్ తోనే లెక్క....వేరే వాళ్ళతో పని లేదు : మంత్రి కోమటిరెడ్డి



**న్యూస్ డెస్క్,03 జులై (కెరటం న్యూస్):** రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల కేసీఆర్ పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రోడ్ల అభివృద్ధి, పనుల పురోగతిపై ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడరు. ఈ సందర్భంగా కేసీఆర్‌ను ఉద్దేశిస్తూ.. ‘కేసీఆర్ అసెంబ్లీకి రావాలి, ఆయన వస్తే ఆ పార్టీ నేతలు కోరుతున్నట్టు అన్ని అంశాలపై చర్చ జరుపుతాం’ అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులైన హరీష్ రావు, కేటీఆర్‌లతో తమకు సంబంధం లేదని, వారు ‘లెక్కలోకి కూడా రారు’ అని వ్యాఖ్యానించారు.

కావాలంటే వారితో రేవంత్ రెడ్డి మాట్లాడతారు, నా రేంజ్ అది కాదు అని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో తాము కీలకంగా పనిచేశామని, తెలంగాణ రాష్ట్ర సాధనకు కాంగ్రెస్ పార్టీయే కృతజ్ఞతలకు అర్హమని పేర్కొన్నారు. హరీష్ రావును “ఉత్తి ఎమ్మెల్యే”గా అభివర్ణిస్తూ.. ఆయన డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కాదని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా కేసీఆర్ రావాలని, ఆయన వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వ తప్పులు, ఒప్పులపై చర్చించాలని డిమాండ్ చేశారు.

మరోవైపు రోడ్ల అభివృద్ధిలో తెలంగాణ దేశానికే రోల్ మోడల్ గా ఉండేలా చేస్తున్నామని అన్నారు. రోడ్డు ప్రమాదాల్లో భారత్ ప్రమచంలోనే ముందు ఉందని, అందులో తెలుగు రాష్ట్రాలు మరీ ముందున్నాయని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాద నివారణకు బ్లాక్ స్పాట్స్ గుర్తించి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. హ్యామ్ పద్ధతిలో రోడ్ల నిర్మాణాలను మూడేళ్లలో పూర్తి చేస్తామని, 4 లైన్ల రోడ్లను 6 లైన్లుగా మార్చడం వల్ల ప్రక్రియ ఆలస్యం అవుతోందని కోమటిరెడ్డి పేర్కొన్నారు.

# మంత్రి ఆదేశాలతో నిధులు విడుదల ఏసీబీ విచారణలో ఐఏఎస్ అరవింద్..

**న్యూస్ డెస్క్,03 జులై (కెరటం న్యూస్):** ఫార్ములా ఈ–కార్ రేసింగ్ కేసులో ఏసీబీ విచారణకు ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ హాజరయ్యారు. జూన్ 16వ తేదీన మాజీ మంత్రి కేటీఆర్ స్టేట్మెంట్ ఆధారంగా అరవింద్ కుమార్ ను విచారణ చేసింది. ఈ కేసులో ఏ2గా అరవింద్ కుమార్, ఏ1గా కేటీఆర్ ఉన్నారు. ఈ సందర్భంగా ఐఏఎస్ అరవింద్ కుమార్ విచారణలో కీలక అంశాలు ప్రస్తావించారు. అప్పటి మున్సిపల్ శాఖ మినిస్టర్ ఆదేశాలతోనే నిధులు విడుదల చేశామని ఏసీబీ విచారణలో అరవింద్ కుమార్ తెలిపారు. HMDW ఖాతా నుంచి ఎఫ్ఈవో కంపనీకి నిధులు మల్లింపుపై నా ప్రమేయం ఆయన లేదని తేల్చి చెప్పారు.అయితే, అప్పటి మంత్రి స్వయంగా వాట్సప్ ద్వారా ఎఫ్ఈవో కి నిధులు విడుదల చేయాలని ఆదేశించారు అని ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ ఏసీబీ విచారణలో తెలిపారు. ఇందులో నాకు ఎలాంటి వ్యక్తిగత స్వార్థం లేదు.. బిజినెస్ రూల్స్, ఆర్థిక శాఖ అనుమతి తీసుకోవాలని మంత్రికి చెప్పాను..ఎఫ్ఈవో కంపనీకి వెంటనే నిధులు విడుదల చేయాలని, అవ్వని నేను చూసుకుంటానని మంత్రి చెప్పారని అరవింద్ కుమార్ వెల్లడించారు. దీంతో 45.71 కోట్ల రూపాయల నగదును ఇండియన్ ఓవర్సిస్ బ్యాంక్ ద్వారా బ్రిటన్ పౌండ్స్ రూపంలో చెల్లించామని తేల్చి చెప్పారు.

# గ్రూప్-1 పిటిషన్లలో ఆరోపణలు అవాస్తవం

## హైకోర్టులో టీజీపీఎస్సీ వాదనలు



**న్యూస్ డెస్క్,03 జులై (కెరటం న్యూస్):** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) గ్రూప్–1 పిటిషన్లపై తెలంగాణ హైకోర్టులో విచారణ కొనసాగుతోంది. భోజన విరామం అనంతరం టీజీపీఎస్సీ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. పరీక్ష రాసిన అభ్యర్థుల సంఖ్య విషయంలో ఎలాంటి తేడా లేదన్నారు. నామినల్ రోల్స్, అభ్యర్థుల వేలిముద్రల ఆధారంగా పూర్తి వివరాలు వెల్లడించినట్లు చెప్పారు.

“కోఠిలోని ఓ కేంద్రంలో పరీక్ష రాసిన వారే ఎక్కువ మంది ఎంపికయ్యారనేది అవాస్తవం. అక్కడ ఉన్న రెండు కేంద్రాలలో 1500 మంది అభ్యర్థులు మెయిన్స్ రాశారు. మిగతా పరీక్షా కేంద్రాల్లో రాసిన వాళ్లలో అంతకంటే ఎక్కువ మందే ఎంపికయ్యారు. కోఠిలోని రెండు కేంద్రాలను కేవలం మహిళలకు కేటాయించడంతో సౌకర్యాలను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నాం. ఉద్యోగానికి ఎంపిక కాని అభ్యర్థులు ఏవేవో అనుమానాలతో పిటిషన్లు దాఖలు చేశారు. వారు చేస్తోన్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవాలు లేవు. కేవలం అపోహలు మాత్రమే గ్రూప్ 1కు ఎంపికైన తెలుగు మీడియం అభ్యర్థులు 9.95 శాతం, ఆంగ్ల మాధ్యమం అభ్యర్థులు 89.88 శాతం, ఉర్దూ మాధ్యమంలో 0.1 శాతంగా ఉన్నారు. ఏపీలో రెండేళ్ల క్రితం నిర్వహించిన ఏపీపీఎస్సీ పరీక్షల్లోనూ ఆంగ్ల మాధ్యమ అభ్యర్థులే ఎక్కువగా ఉన్నారు. టీజీపీఎస్సీకి తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మాధ్యమ అభ్యర్థుల పట్ల ఎలాంటి వివక్ష లేదు. అందరికీ నిపుణులు ఎంపిక చేసిన అంశాల ఆధారంగా మార్కులు వేశారు”అని కోర్టుకు తెలిపారు.

# చంద్రబాబుతో చెట్టాపట్టాల్ వేసుకుని బనకచర్లకు ఒప్పుకుంది మీరు కాదా..?



**న్యూస్ డెస్క్,03 జులై (కెరటం న్యూస్):** సుదీర్ఘ కాలం పాటు రాజకీయ చరిత్ర కలిగిన ఏఐసీసీ అధినేత మల్లికార్జున ఖర్గే సాయంత్రం హైదరాబాద్ వస్తున్నారు అని టీపీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. నేరుగా గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, మండల, జిల్లా అధ్యక్షులతో సమావేశమవుతారు.. కాంగ్రెస్ పార్టీ అందరి పార్టీ అందరికి సమన్యాయం చేస్తారు.. రేపటి ఖర్గే సభకి సామాజిక న్యాయ సమరా భేరి సమావేశంగా పేరు పెట్టామని చెప్పుకొచ్చారు. జైబాపు, జైభీం, జైసంవిధాన్ కార్యక్రమాన్ని ఆరు నెలలుగా విజయవంతంగా కొనసాగుతోంది అన్నారు. రేపు ఉదయం గాంధీ భవన్ లో జరిగే పీఏసీ సమావేశంలో ఖర్గే పాల్గొంటారు.. సాయంత్రం 3 గంటల ప్రాంతంలో ఎల్బీ స్టేడియంలో కార్యకర్తలతో భేటీ అవుతారని మహేష్ గౌడ్ వెల్లడించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు పీసీసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కౌంటర్ ఇచ్చారు. కవిత బీఆర్ఎస్ నాయకురాలుగా లెటర్ రాసిందా, జాగృతి నాయకురాలుగా రాసిందా అని ప్రశ్నించారు. మేము బీసీల కోసం వాగ్దానం చేసిన రోజు కవిత తీహార్ జైల్లో ఊసలు లెక్కపెడుతుంది అని ఎద్దేవా చేశారు. కవిత జైల్లో ఉండి ఊసలు లెక్కపెడుతూ బీసీల కోసం ఉద్యమం చేసిందా.. గొర్లు, బర్ల పేరుతో స్కామ్స్ చేసి దండుకుంది మీ ఫ్యామిలీ కాదా? అని ఆరోపించారు. రాజకీయ శూన్యంలో ఉన్న కవిత మనుగడకోసం మాట్లాడుతుంది.. ఏమి చేశారని లోకల్ బాడీలో బీఆర్ఎస్ 80 శాతం గెలుస్తుంది.. స్థానిక సంస్థల ఎన్నికల్లో మీకు ఎందుకు ఓట్లు వేస్తారు అని అడిగారు. రాష్ట్ర సంపద దోచుకున్నారని మీకు ఓట్లు వేస్తారా?.. బీసీల విషయంలో కాంగ్రెస్ ఛాంపియన్ అని మహేష్ గౌడ్ చెప్పుకొచ్చారు. ఇక, బీజేపీలో సమర్థవంతమైన బీసీ నాయకుడు లేడా? అని తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ గౌడ్ ప్రశ్నించాడు. రామచందర్ రావుని అధ్యక్షుడిని చేశారు.. బీసీల విషయంలో చిత్త శుద్ధి ఉన్న ఏకైక పార్టీ కాంగ్రెస్.. హరీష్ రావు అన్నట్లు అసెంబ్లీలో చర్చకు సీఎం రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నారు.. హరీష్ రావుకు దమ్ముందా? అని అడిగారు. అలాగే, చంద్రబాబుతో చెట్టాపట్టాలు వేసుకుని బనకచర్ల ప్రాజెక్టుపై ఒప్పుకుంది మీరు కాదా? అని అడిగారు. ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి స్టేట్మెంట్ పై తీవ్రంగా పరిగణిస్తున్నాం.. పార్టీలో అందరూ క్రమ శిక్షణతో ఉండాలి.. లేకపోతే, తీవ్ర పరిణామాలు ఎదుర్కొవల్సి వస్తుందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# బనకచర్లపై రాహుల్ గాంధీ మౌనం కుట్రపూరితమే: కేటీఆర్



**న్యూస్ డెస్క్,03 జులై (కెరటం న్యూస్):** బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం గురించి రాహుల్ గాంధీ మౌనం వహించడం కుట్రపూరితమే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కేటీఆర్ తన సోషల్ మీడియా పోస్టులో... లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడిగా ఏడాది పూర్తి చేసుకుంటున్న తరుణంలో రాహుల్ రాష్ట్ర ప్రజలకు చేసిన ద్రోహం తీవ్రరూపం దాల్చిందని పేర్కొన్నారు. తెలంగాణకు సంబంధించిన పెద్ద సమస్యలను, 2014 విభజన చట్టంలో నెరవేరని హామీలను రాహుల్ గాంధీ ఒక్కసారి కూడా లోక్ సభలో లేవనెత్తలేదని అన్నారు.

నీటిపారుదల ప్రాజెక్టులకు జాతీయ హోదా అయినా, బయ్యారం ఉక్కు కర్మాగారం గురించి అయినా ఒక్కసారి కూడా ఆయన లేవనెత్తలేదని ఆరోపించారు. గోదావరి నీటి హక్కులను మళ్లించే ప్రమాదం ఉన్న ఏపీలోని బనకచర్ల ప్రాజెక్టుపై కూడా ఆయన మౌనం వహించడం కుట్రపూరితమే అని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో 420 వాగ్దాలను ప్రకటించిన తరవాత రాహుల్ గాంధీ నీడలా మసకబారిపోయారని, తెలంగాణ ఆకాంక్షలు నీరుగారిపోతుంటే కాంగ్రెస్ అధికారం మత్తులో మునిగిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# నన్ను డమ్మీ అన్నవాళ్లకు డాడీ అవుతా : తెలంగాణ బీజేపీ స్టేట్ చీఫ్

మొదటి పేజీ తరువాయి

రాజాసింగ్ అంశం జాతీయ నాయకత్వం చూసుకుంటుందని చెప్పారు. తాను డమ్మీ లీడర్‌నా.. కాదా..? అనేది త్వరలో చూపిస్తా అని స్ట్రాంగ్ కామెంట్స్ చేశారు. నన్ను డమ్మీ అన్నవాళ్లకు డాడీ అవుతా అని అన్నారు. మొత్తం తెలంగాణలో నా కంటే ఫైర్ బ్రాండ్ ఎవరూ లేరని కీలక వ్యాఖ్యలు చేశారు. తన రాజకీయ జీవితంలో ఇప్పటివరకు 14 సార్లు జైలుకు వెళ్లి వచ్చాను.. లాఠీ దెబ్బలు తిన్నాను, మావోయిస్టులతో పోరాటం చేశానని గుర్తుచేశారు. అందరినీ కలుపుకుపోవాలి అని ఉద్దేశంతోనే కూల్‌గా ఉంటున్నాను.. నా ఉగ్రరూపం చూస్తే తట్టుకోలేరు అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. చొక్కా గుండీలు విప్పి బూతులు మాట్లాడితేనే అగ్రెసివ్ లీడర్ కాదు.. సిద్ధాంతాన్ని బలంగా ముందుకు తీసుకెళ్లగలిగిన వాడే అసలైన లీడర్ అని అన్నారు. ఆ నమ్మకం, సంకల్పం నాకుంది అని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం మా పార్టీలో ఎలాంటి విభేదాలు లేవు.. అందరం కలిసిగట్టుగానే పనిచేస్తాం అని ప్రకటించారు.

# జీపీఓలకు అతి త్వరలోనే నియామక పత్రాలు

## రెవెన్యూ ఉద్యోగ సంఘాలతో సీసీఎల్ఏ సమావేశం

## రెవెన్యూ జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి

మొదటి పేజీ తరువాయి



రాష్ట్రంలో ఉన్న 10,954 గ్రామాలలో ఆదే సంఖ్యలో జీపీఓల నియామకం చేయాలన్నారు. కానీ ప్రస్తుతం 3,454 మంది మాత్రమే ఎంపిక అయ్యారని గుర్తు చేశారు. ఇదే కాకుండా ఆసక్తి కలిగిన పూర్వ వీఆర్ఏ, వీఆర్వోలకు మరో సారి జీపీఓ అర్హత పరీక్ష రాసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. 61 ఏళ్లు దాటిన వీఆర్ఏల వారసులకు సైతం జీపీఓలుగా అవకాశం కల్పించాలని కోరారు. ఇంకా మిగిలిన పోస్టులకు డైరెక్ట్ రిక్రూట్మెంట్ ద్వారా భర్తీ చేసేలా చూడాలన్నారు. ఇదే కాకుండా వీఆర్ఏలను ఇతర డిపార్ట్ మెంట్ లలో సర్దుబాటు చేసే సమయం కంటే మృతి చెందిన వారి కుటుంబాలలో కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. సర్దుబాటు సమయంలో ఇతర జిల్లాలకు పంపిన పూర్వ వీఆర్ఏలను సొంత జిల్లాలకు బదిలీ చేయాలని కోరారు. అన్ని అంశాలపై ప్రిన్సిపల్ సెక్రటరీ, సీసీఎల్ఏ లోకేష్ కుమార్ సానుకూలంగా స్పందించారు. ఎంపికైన జీపీఓల, ఇతర విషయాలను రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తో చర్చించి అతి త్వరలోనే ఈ ప్రక్రియ ను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. పని ఒత్తిడిని బట్టి కార్యాలయాలలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ లతో కూడా భూ భారతి సదస్సుల దరఖాస్తులు ఎంక్వైరీ చేయించడానికి జిల్లా కలెక్టర్ లకు ఉత్తర్వులు ఇస్తామని కూడా తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు ఎస్.రాములు, రమేష్ పాక, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం, మల్లేష్ , రాంబాబు, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# ఐటీ కారిడార్‌లో బోనాల జాతర.. శిల్పకళా వేదిక నుంచి దేవస్థానానికి శోభాయాత్ర..!

**న్యూస్ డెస్క్,03 జులై (కెరటం న్యూస్):** తెలంగాణ సాంప్రదాయాలకు ఆధునికతను మేళవిస్తూ, తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు టీహబ్ వేదికగా తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టీటా) బోనాలు 2025 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీటా గ్లోబల్ అధ్యక్షుడు సందీప్ కుమార్ మక్తాలా, బోనాల నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ ఏడాది ఐటీ బోనాలు వేడుకలు, తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ భాగస్వామ్యంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సందీప్ మక్తాలా, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణకి సంస్కృతి పరిరక్షణలో అందిస్తున్న అప్రతిహత మద్దతుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆషాఢ మాసం రెండో ఆదివారం, జూలై 6న జరగనున్న ఈ ఐటీ బోనాలు వేడుకల్లో గతంలో పాల్గొన్న తన అనుభవాలను గుర్తు చేసుకున్న మంత్రి శ్రీధర్ బాబు.. వాతావరణంలో సంప్రదాయాన్ని నిలిపే ఈ వేడుకలు ఎంతో గొప్పవని, టీటా ద్వారా ఈ సంస్కృతి ఆధారిత కదలిక ఐటీ కారిడార్‌లో నిలబెట్టడం అభినందనీయమని ప్రశంసించారు. ఈ సంవత్సరం వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా, శిల్పకళా వేదిక నుంచి చిన్న పెద్దమ్మ దేవస్థానానికి భారీ ఊరేగింపు నిర్వహించనున్నారు. ఊరేగింపు ప్రారంభానికి ముందు, సందీప్ మక్తాలా కుటుంబం, అమ్మవారికి చీర సారెలతో, ఒడి బియ్యాన్ని సమర్పించి ప్రత్యేక సంప్రదాయ పూజ నిర్వహిస్తారు.

ఇన్ఫోసిస్, ఐబీఎం, మైక్రోసాఫ్ట్ సహా ప్రముఖ ఐటీ కంపెనీల నుండి వచ్చిన 21 బోనాలు, తమ తమ కార్యాలయాల నుండి బయలుదేరి శిల్పకళా వేదిక వద్ద కలుస్తాయి. అక్కడి నుండి ఊరేగింపుగా చిన్న పెద్దమ్మ దేవస్థానానికి ప్రదక్షిణగా సాగుతాయి. భక్తితో పాటు సంగీతం, సంప్రదాయం, ఐక్యత నిండిన ఈ ప్రదర్శన ఉద్యోగులకు ఓ సాంస్కృతిక పండుగను రుచి చూపించనుంది.

పోతురాజులు, శివసత్తులు, డప్పులు, ఒగ్గు డోలు, గుస్సాడి తదితర ప్రజాకళల బృందాలు సాంప్రదాయ ప్రదర్శనలు ఇస్తాయి. ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణ జానపద కళలకు అంతర్జాతీయ ఐటీ వేదికపై గుర్తింపు లభిస్తుంది. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో భాగ్యలక్ష్మి వాకిటీ, శ్రీనివాస్ మారి, హరిని గోలీ, యామిని, మనసా, దినేష్, కీర్తన్, ప్రణీత్, వెంకట్ బూరా వంటి టీటా బోనాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో దారుణం.. తిట్టారన్న కోపంతో.. యజమానురాలు, కుమారుడిపై హత్యాకాండ!

**న్యూస్ డెస్క్,03 జులై (కెరటం న్యూస్):** దేశ రాజధాని ఢిల్లీలో దారుణం జరిగింది. తిట్టారన్న కోపంతో ఇంటి యజమానురాలిని, ఆమె చిన్న కుమారుడిని అత్యంత దారుణంగా పని మనిషి చంపేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిని అరెస్ట్ చేశారు.

ఢిల్లీలోని లజ్‌పత్ నగర్‌లోని ఓ ఇంట్లో ఇద్దరు హత్యకు గురయ్యారు. బుధవారం సాయంత్రం ఇంటి యజమాని రుచిక సెవానీ, ఆమె కొడుకు.. పని మనిషిపై కేకలు వేశారు. అంతే కోపం పెంచుకుని.. రుచికను, ఆమె చిన్న కొడుకు గొంతు కోసి చంపేశాడు. అనంతరం అక్కడ నుంచి నిందితుడు పరారయ్యాడు.

బుధవారం రాత్రి 9:30 గంటల ప్రాంతంలో రుచిక భర్త కుల్దీప్ సెవానీ.. ఆఫీసు పని ముగించుకుని తిరిగి ఇంటికి వచ్చేసరికి తలుపు మూసి ఉండటం గమనించాడు. భార్య, 14 ఏళ్ల కుమారుడు క్రిష్‌కు ఫోన్ చేశాడు. కానీ ఇద్దరి నుంచి ఎటువంటి స్పందన రాలేదు. కుల్దీప్ సెవానీ గేటు దగ్గర, మెట్లపై రక్తపు మరకలు గమనించాడు. భయపడి.. అతడు పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి భార్య, కొడుకు కనిపించడం లేదని ఫిర్యాదు చేశాడు. పోలీసులు వచ్చి తలుపు పగలగొట్టి చూసేసరికి భార్య, కొడుకు విగతజీవిగా పడి ఉండడం చూసి అవాక్కయ్యాడు. రుచిక (42) మంచం పక్కన నేలపై పడి ఉంది. మొత్తం రక్తంతో నిండి ఉంది. ఇక కుమారుడు క్రిష్ పదో తరగతి చదువుతున్నాడు. బాత్రూమ్‌లో రక్తపు మడుగులో నిర్జీవంగా పడి ఉన్నాడు.

రుచిక సెవానీ తన భర్తతో కలిసి లజ్‌పత్ నగర్ మార్కెట్లో బట్టల దుకాణం నడుపుతూ ఉంది. దుకాణంలో పని చేసే ముఖేష్(24)ను పోలీసులు అరెస్ట్ చేశారు. నగరం నుంచి పారిపోతుండగా ముఖేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. రుచిక, ఆమె కొడుకు తిట్టినందుకే చంపేసినట్లు నేరాన్ని అంగీకరించాడు. ముఖేష్‌ది బీహార్. అమర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు.

## కోటయ్యను పరామర్శించిన నున్న నాగేశ్వరరావు



**ఖమ్మం టౌన్,03 జులై (కెరటం న్యూస్):** ఇటీవల అనారోగ్యానికి గురై ఆరోగ్య హాస్పటల్లో చికిత్స పొంది తన ఇంటి వద్ద రెస్ట్ తీసుకుంటున్న సిపిఎం సీనియర్ నాయకుడు దొంగల కోటయ్యను సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు గురువారం పరామర్శించారు. దొంగల కోటయ్య గుండెకు సంబంధించిన సమస్యతో బాధపడుతూ హాస్పిటల్ లో చికిత్స పొందిన విషయాన్ని తెలుసుకొని వారి ఇంటి వద్దకువెళ్లి నున్నా పరామర్శించారు. దొంగల కోటయ్య ఆరోగ్య పరిస్థితిని, యోగక్షేమాలను తెలుసుకొని పలు సూచనలు చేసి త్వరగా కోలుకోవాలని అందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. నున్నా నాగేశ్వరావు తో పాటు సిపిఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రం, బుగ్గవీటి సరళ, బండి పద్మ, షేక్ మీరా సాహెబ్, ఎస్ నవీన్ రెడ్డి, దొంగల తిరుపతిరావు, చిలకల వెంకటేశ్వర్లు, తుడుం ప్రవీణ్, గాలి వెంకటాద్రి కత్తుల అమరావతి, గాలి అంజయ్య, తిప్పర్తి నరసింహారావు, తోట నాగరాజు, పోతురాజు వెంకటి, జట్ల ఆనందరావు, నలమల సత్యనారాయణ, వేదగిరి మురహరి, డ్రైవర్ గోపి, తదితరులు ఉన్నారు.

## జూలై 5 నెల నెలా మెడికల్ క్యాంపు



**ఖమ్మం టౌన్,03 జులై (కెరటం న్యూస్):** బీవీకే, సీపీఎం పార్టీ టూ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో జూలై 5న మొదటి శనివారం మంచికంటి హాల్ లో మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు, ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సీపీఎం పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, బీవీకే మేనేజర్ వై శ్రీనివాసరావు ఒక ప్రకటనలో కోరారు. గత ఎనిమిది సంవత్సరాలుగా ప్రతి నెలా మెడికల్ క్యాంపు జరుగుతుంది అని, బిపి, షుగర్, తదితర అనారోగ్య సమస్యలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ జరుగుతుంది అని తెలిపారు. నగరంలోని ప్రముఖ వైద్యులు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అని తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటలకు వరుకు మెడికల్ క్యాంపు జరుగుతుంది అని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## వైద్య శిబిరం బ్యానర్ ఆవిష్కరించిన ఎస్పి




**కొత్తగూడెం,03 జులై (కెరటం న్యూస్):** వికాస తరంగిణి కొత్తగూడెం శాఖ ఆధ్వర్యంలో మహిళా ఆరోగ్య వికాస్ కార్యక్రమంలో భాగంగా నేడు అనగా శుక్రవారం రేగళ్ల గ్రామంలో నిర్వహించనున్న ఉచిత క్యాన్సర్ క్యాంప్‌కి సంబంధించిన బ్యానర్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ బి.రోహిత్ రాజు గురువారం ఎస్పీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బి.రోహిత్ రాజును నిర్వాహకులు ఆహ్వానించారు. ఈ క్యాన్సర్ క్యాంప్ ని మహిళలందరూ ఉపయోగించుకోవాలని వికాస తరంగిణి కోఆర్డినేటర్ గుంటూరి రమాదేవి కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రాజ్యలక్ష్మి, పూర్ణ మొబ్కెల్స్ యజమాని యెల్దండి పూర్ణచందర్ రావు, లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం అధ్యక్షులు లగడపాటి రమేష్ చంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఖలీల్ భాయ్ బిర్యానీ హెూటల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న వనమా రాఘువ



**కొత్తగూడెం,03 జులై (కెరటం న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం రామాంజనేయ కాలనీ బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త ఖలీల్ బాయ్ బిర్యానీ హెూటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వనమా రాఘవేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖలీల్‌కు శుభాకాంక్షలు తెలియజేసి, వ్యాపారంలో దినదిన అభివృద్ధి చెందాలని స్వీట్ తినిపించి దీవించారు. ఈ కార్యక్రమంలో వనమా రాఘవేందర్ వెంట మాజీ ఎంపీపీ బాదావత్ శాంతి, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ బత్తుల వీరయ్య, మాజీ కౌన్సిలర్ వేముల ప్రసాద్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు బొమ్మిడి రమాకాంత్, పిల్లి కుమార్, బొందుగుల శ్రీధర్, హైమత్, కరాటే శీను, అచ్చ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ లో ఉన్న ఫీజు బకాయిలను చెల్లించండి

### పీడీఎస్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వంగూరి వెంకటేష్



**ఖమ్మం టౌన్,03 జులై (కెరటం న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా విద్యార్థులకు రావలసిన ఫీజుబకాయల విషయంలో స్పందించకుండా విద్యార్థులకు మొండి చేయి చూపిస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంపై విద్యార్థులు రాజీలేని పోరాటానికి సిద్ధపడాలని పి డి యస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ అన్నారు. పి డి యస్ యూ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్, రియంబర్స్మెంట్, 8000వేల కోట్లు బెస్ట్ అవైలబుల్ 200ల కోట్లు బకాయి నిధులను వెంటనే విడుదల చేయాలి ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థుల ఐక్యత పి డి యస్ యూ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావుల ఆఫీస్ ముట్టడించిన పి డి ఎస్ యూ ఖమ్మం జిల్లా బృందంన్ని అక్రమంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కి తరలిండాన్ని సమాజం ఖండించా లన్నారు. ఈ సందర్భంగా వంగూరి వెంకటేష్ మాట్లాడుతూ తెలంగాణలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటుందని వారు అన్నారు. గత మూడు సంవత్సరాల నుండి విద్యార్థులకు రావలసిన ఎనిమిది వేల కోట్ల రూపాయల బెస్ట్ అవైలబుల్ రొండువందల కోట్లు ఫీజుబకాయలను చెల్లించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని గత కేసీఆర్ ప్రభుత్వానికి పట్టిన గతే నేటి రేవంత్ రెడ్డి సర్కార్ కు పడుతుందని వారు హెచ్చరించారు. ప్రభుత్వ కాలేజీ లో చదివివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలనీ ప్రభుత్వ విద్యాసంస్థల లో చదివే విద్యార్థులకు ఉచిత బస్సు పాస్సులు ఇవ్వాలన్నారు. నెల నెలా ప్రజా ప్రతినిధులకి జీతాలు చెల్లించే ప్రభుత్వం విద్యార్థులకు ఎందుకు మొండి చేయి చూపిస్తుందని ప్రశ్నించారు. ఏ ప్రభుత్వ హయాంలో రాష్టంలో విద్యారంగా పరిస్థితి ధరణంగా ఉందిఅని చెప్పినా ఏమాత్రం పట్టింపు లేని రేవంత్ రెడ్డి పాలన ప్రజాపాలన ఏవిధంగా అవుతుందని వారు అన్నారు. ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ రాకపోవడంతో ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఫీజులు చెల్లిస్తేనే ఇస్తామని ఒత్తిడి చేస్తున్నా ప్రభుత్వం నుండి ఏమాత్రం స్పందన లేకపోవడం బాధాకరమని రియంబర్స్మెంట్ పథకాన్ని నిర్లక్ష్యం చేసి భవిష్యత్తులో ఎత్తివేయడం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం కుటిల ప్రయత్నాలు కొనసాగిస్తుందని వారు తెలిపారు. నేడు విద్యావ్యవస్థ కోలుకోలేని విధంగా తయారయింది అన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఖమ్మం జిల్లా కేంద్రంగాఉన్న ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు,జర్నలిస్ట్ పిల్లలకు 50శాతం ఫీజు లు రాయితీ ఇవ్వకుండా విద్యా ప్రమాణాలు పాటించకుండా సంపాదనే లక్ష్యంగా విద్యా వ్యాపారానికి పాల్పడుతూ పేద వర్గాల వద్ద అధిక మొత్తంలో డొనేషన్ల పేరుతో ఫీజులను గుంజుతూ పేదల రక్తాన్ని జలగల్లా పీల్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీ లో ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫీజు రియంబర్స్మెంట్ బెస్ట్ అవైలబుల్ ఫీజు ల ని తక్షణమే విడుదల చేయాలని లేని పక్షంలో విద్యార్థులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలో చేపడుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు ఖమ్మం జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, జిల్లా నాయకులు వినయ్, కార్తీక్, పృథ్వి, సురేష్, నసీర్, చందు, అశోక్, ప్రసాద్, పేర్ల వెంకటేష్, నరేంద్ర ర్, వరుణ్, సంతోష్, అఖిల్ స్టాలిన్, తదితరులు పాల్గొన్నారు.



# ఖమ్మం నగరానికి ధీటుగా మండల హెడ్ క్వార్టర్ అభివృద్ధి

## తెలంగాణ రెవెన్యూ మంత్రి పొంగులేటి

**కూసుమంచి(ఖమ్మం),03 జులై (కెరటం న్యూస్):** నగరాలకు ధీటుగా కూసుమంచి మండల హెడ్ క్వార్టర్ ను అభివృద్ధి చేస్తున్నామని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. కూసుమంచి మండలంలో ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాం రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిలతో కలిసి గురువారం కూసుమంచిలో పర్యటించి పలు రోడ్డు నిర్మాణ, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసారు. ధర్మతండా గ్రామంలో 36 లక్షలతో కూసుమంచి ఆర్ అండ్ బి రోడ్డు నుండి ధర్మతండా వరకు చేపట్టిన రోడ్డు మరమ్మతుల పనులకు, లోక్యాతండా గ్రామంలో ఒక కోటి 26 లక్షలతో లోక్యాతండా నుండి ధర్మతండా వరకు, ఒక కోటి 16 లక్షలతో లోక్యాతండా నుండి అగ్రహారం వరకు చేపట్టిన రోడ్డు మరమ్మత్తు పనులకు, కోక్యాతండా గ్రామంలో 2 కోట్ల 90 లక్షలతో కోక్యాతండా నుండి వీర్యాతండా వరకు నిర్మించనున్న బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు, గన్యాతండా గ్రామంలో 3 కోట్ల 30 లక్షలతో గన్యా తండా నుండి మోటాపురం వీరన్న స్వామి టెంపుల్ వరకు నిర్మించనున్న బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు, కూసుమంచి గ్రామంలో 6 కోట్ల 50 లక్షలతో చేపట్టిన జంక్షన్ అభివృద్ధి పనులకు, ఖమ్మం - కోదాడ, కూసుమంచి, నేలకొండపల్లి పట్టణ పరిధిలోని కూసుమంచి, నేలకొండపల్లి రోడ్డులో ఏర్పాటు చేయు డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.

కోక్యా తండాలో నిర్మాణంలో ఉన్న బాణోత్ సురేష్, భూమిక ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని మంత్రి పరిశీలించారు. నిర్మాణంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగారు. ప్రభుత్వం నుండి ఉచితంగా ఇసుక అందిస్తున్నట్లు, నిర్మాణం పూర్తి అయిన వాటికి దశల వారిగా ప్రతి సోమవారం విడతలుగా నేరుగా లబ్దిదారుని ఖాతాల్లో జమచేస్తున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... కూసుమంచి, నేలకొండపల్లి మండల హెడ్ క్వార్టర్ లలో 6 కోట్ల 50 లక్షల రూపాయలతో చేపట్టిన సెంట్రల్ లైటింగ్, డివైడర్స్, జంక్షన్ అభివృద్ధి పనులు కొద్ది నెలల్లో పూర్తి చేస్తామని, ఖమ్మం నగరానికి ధీటుగా కూసుమంచి మండల హెడ్ క్వార్టర్ ను తయారు చేస్తామని అన్నారు. కూసుమంచి మండల హెడ్ క్వార్టర్ లో కోట్ల రూపాయలు ఖర్చు చేసి అంతర్గత రోడ్లు నిర్మించామని, త్రాగునీటి సరఫరా సమస్యలు పరిష్కరించామని, 50 లక్షల రూపాయలతో షాదీ ఖానా మంజూరు చేసుకున్నామని అన్నారు. ప్రభుత్వ



జూనియర్ కళాశాలను సుమారు ఐదున్నర కోట్ల రూపాయలతో మంజూరు చేశామని, త్వరలోనే శంకుస్థాపన చేస్తామని అన్నారు. గత 18 నెలల కాలంలో ధర్మతండా గ్రామంలో 22 లక్షల రూపాయలతో అంతర్గత రోడ్లు పూర్తి చేశామని, 20 లక్షల రూపాయలతో గిరిజన శాఖ ద్వారా పలు అభివృద్ధి పనులు, లోక్యతండా గ్రామంలో 70 లక్షల రూపాయలతో సిమెంట్ రోడ్లు, 12 లక్షలతో అంగన్ వాడి కేంద్రాల అభివృద్ధి, 4 లక్షల రూపాయలతో త్రాగు నీటి సరఫరా పనులు, కొక్యా తండా లో 14 లక్షలు ఖర్చుపెట్టి సిమెంట్ రోడ్లు, 12.35 లక్షలతో అంగన్వాడీ భవనం, 10 లక్షలు ఖర్చు పెట్టి మంచినీటి సమస్య తీర్చుకున్నామని అన్నారు.

పాలేరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో గత 18 నెలల కాలంలో సుమారు 1400 నుంచి 1500 కోట్ల రూపాయలతో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మంజూరు చేసుకున్నామని తెలిపారు. ప్రజల దీవెనలతో రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడినందున ఇంత అభివృద్ధి సాధ్యం అవుతుందని అన్నారు. గత పాలకులు అమలు చేసిన సంక్షేమం కొనసాగిస్తూ 200 యూనిట్లు ఉచిత విద్యుత్, 500 రూపాయల గ్యాస్ సిలిండర్, రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం సరఫరా, నూతన రేషన్ కార్డుల జారీ, రెసిడెన్షియల్ హాస్టల్స్ లలో డైట్ చార్జీలు 40 శాతం, కాస్మోటిక్స్ చార్జిలు 200 శాతం పెంచామని, రైతులకు 21 వేల కోట్ల రూపాయలతో 2 లక్షల రుణ మాఫీ చేశామని అన్నారు.

గత ప్రభుత్వం రైతుకు పెట్టుబడి సహాయం ఎకరానికి 10 వేల రూపాయలు అందిస్తే, ప్రజా ప్రభుత్వం రైతులకు అందించే సహాయం 12 వేలకు పెంచి, 9 రోజుల వ్యవధిలో దాదాపు 9 వేల కోట్ల రూపాయ లను రైతు భరోసా నిధులు జమ చేసామని అన్నారు. ప్రతి గ్రామంలో అర్హులకు ఇందిరమ్మ ఇళు ల్ల ప్రస్తుత ప్రభుత్వం పూర్తి స్థాయిలో అందిస్తుందని అన్నారు. రాబోయే మూడున్నర సంవత్సరాలలో మరో 3 విడతల్లో అర్హులైన పేదలను ఎంపిక చేసి ఇందిరమ్మ ఇండ్లను పంపిణీ చేస్తామని అన్నారు. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ .... నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పనులు చేపట్టడం సంతోషకరమని అన్నారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 లకు గ్యాస్ సిలందర్, రైతు రుణమాఫీ, రైతు భరోసా అందిస్తున్నదని అన్నారు. అర్హులైన పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలుచేస్తుందన్నారు.

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.... శంఖుస్థాపన చేసిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పనులు నాణ్యతతో పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, ఇర్రిగేషన్ ఎస్ఇ ఎం. వెంకటేశ్వర్లు, ఇఇ మిషన్ భగీరథ వాణిశ్రీ, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సరిత, విద్యుత్ శాఖ ఏడిఇ లోక్యా నాయక్, కూసుమంచి మండల తహసీల్దార్ రవికుమార్, ఎంపిడివో వేణుగోపాల్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి ఉద్యమాల దిక్సూచి ఏఐఎస్ఎఫ్

**● విద్యారంగ సమస్యలపై సమరశీల పోరాటాలుకు సిద్ధం అవ్వండి ● విద్యా కాషాయీకరణ కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుదాం ● పెండిరగ్ స్కాలర్షిప్, ఫీజురీయింబర్స్మెంట్ తక్షణమే విడుదల చేయాలి ● ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ ● పాల్వంచలో ఏఐఎస్ఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 4వ జిల్లా మహాసభ**




**పాల్వంచ,03 జులై (కెరటం న్యూస్):** విద్యార్థి ఉద్యమాల దిక్సూచి ఏఐఎస్ఎఫ్ అని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ అన్నారు. గురువారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో ఏఐఎస్ఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 4వ జిల్లా మహాసభ నిర్వహించారు. మహాసభ ప్రారంభ సూచికగా ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి ఉప్పుశెట్టి రాహుల్ అరుణ పతాకాన్ని ఆవిష్కరణ చేశారు. అనంతరం జరిగిన ప్రతినిధుల సభలో పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ.. బ్రిటిష్ పరాయి పాలకుల చెర నుండి భరతమాత విముక్తి కోసం విద్యార్థులను అందరిని ఒక్క తాటిపైకి తీసుకురావటానికి లక్నో నగరాన




బెనారస్ విశ్వవిద్యాలయంలో 1936 ఆగస్టు 12న అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆవిర్భవించిందని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమం అనంతరం విద్యారంగ సమస్యల పరిష్కారమే ఏకైక లక్ష్యంగా ఆనాటి నుండి నేటి వరకు సమరశీల ఉద్యమాలు కొనసాగిస్తున్న ఈ దేశ ప్రథమ విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై, కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో విద్య ఉపాధి హక్కుల సాధనకై సమరశీల పోరాటాల కు సిద్ధం కావాలని విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానం వలన పేద మధ్యతరగతి విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఏర్పడుతుందని కేవలం డబ్బున్న వాడే విద్యను అభ్యసించే రోజులు రాబోతున్నాయని ఇటువంటి విద్యా వ్యతిరేక నూతన విద్యా విధానాన్ని తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా దళిత గిరిజన మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ దేశంలో పుట్టిన ప్రతి బిడ్డకు సమానమైన విద్యను అందించాలని డిగ్రీలు పూర్తి చేసిన ప్రతి విద్యార్థికి భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ ఆక్ట్ అమలు చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఎంఈఓ, ఉపాధ్యాయ పోస్టులను తక్షణమే భర్తీ చేసి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పెండిరగ్ స్కాలర్షిప్, రియంబర్స్మెంట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల రామకృష్ణ మాట్లాడుతూ పూర్తిస్థాయి వార్డెన్లు లేక సంక్షేమ హాస్టల్లో సమస్యలతో విలియతాండనం చేస్తున్నాయని సరైన వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత పాలకుల నిర్లక్ష్యంతో విద్యారంగం తీవ్రంగా నష్టపోయిందని, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందన సమస్యల నిలయంగా ఉన్నాయని నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లపై దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వర్క అజిత్, యు.హరీష్, షాహిద్, రణధీర్ అధ్యక్షతన జరిగిన మహాసభలో మాజీ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కె చాంద్ పాషా, జిల్లా కార్యదర్శి పహీమ్ దాదా, అధ్యక్షుడు జర్పుల ఉపేందర్, గుండాల సుజన, పవన్ సాయి, నాగేంద్ర బాబు, బతుల సాయి, వినయ్, వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# రియంబర్స్మెంట్, స్కాలర్షిప్స్ విడుదల చేయాలి



**ఖమ్మం టౌన్,03 జులై (కెరటం న్యూస్):** ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్స్ విడుదల చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పీడీఎస్యూ ఇచ్చిన 72 గంటల కాలేజీల రెండవ రోజున బంద్ ఖమ్మం జిల్లా వ్యాప్తంగా విజయవంతమైంది. విద్యార్థులు, విద్యా సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించారు అనంతరం పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.

# కేంద్ర మంత్రి, ఎంపీలకు ఘన సత్కారం

**ఎంపీ వద్దిరాజు గ్రానైట్ జ్ఞాపికల బహుకరణ**



**రంగారెడ్డి బ్యూరో,03 జులై (కెరటం న్యూస్):** కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, సహాయ మంత్రి సతీష్ చంద్ర దూబేలతో పాటు ఆ శాఖ పార్లమెంటరీ సలహా సంఘం సభ్యులకు ఘనమైన సత్కారం లభించింది. గురువారం రంగారెడ్డి జిల్లాలోని కన్హా శాంతివనంలో బొగ్గు, గనుల శాఖ పార్లమెంటరీ సలహా మండలి సమావేశం మంత్రి కిషన్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి విచ్చేసిన మంత్రులు, ఎంపీలకు సింగరేణి యాజమాన్యం ఆతిథ్యం ఇచ్చింది. తెలంగాణలో ప్రత్యేకించి హైదరాబాద్ సమీపంలో తొలిసారిగా జరుగుతున్న సమావేశం కావడంతో హాజరైన సభ్యులకు రాజ్యసభ ఎంపీ, సలహా సంఘం సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆధ్వర్యంలో గ్రానైట్ జ్ఞాపికలు బహుకరించారు. తన సొంత గ్రానైట్ క్వారీ నుంచి సేకరించిన నల్లరాయి పై మంత్రులు, ఎంపీల చిత్రాలను కార్వింగ్ చేయించి, వాటిని జ్ఞాపికల రూపంలో బహుకరించారు. ఎంపీ రవిచంద్ర విదేశీ పర్యటనలో ఉండటం చేత ఆతిథ్య సంస్థ సింగరేణి సంస్థ సీఎండీ ఎన్. బలరామ్ వాటిని మంత్రులు, అతిథులకు బహుకరించారు. గ్రానైట్ రాయిపై ప్రత్యేకంగా రూపొందించిన చిత్రాలను చూసి మంత్రులు, అతిథులు ముగ్ధులయ్యారు. ఈ సందర్భంగా వారు ఎంపీ రవిచంద్రకు కృతజ్ఞతలు తెలిపారు. వీటితో పాటు అతిథులకు తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని కూడా ఎంపీ రవిచంద్ర ఆధ్వర్యంలో మంత్రులు, ఎంపీలు, మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులకు అందజేశారు.



# ప్రముఖ కవి మాల్యాశ్రీకి స్మారక సాహితీ పురస్కారం

**అంతర్జాతీయ కథల, కవితల పోటీల ఫలితాలు వెల్లడి**





**ఉమ్మడి ఖమ్మం,03 జులై (కెరటం న్యూస్):** ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన కవి మాల్యాశ్రీకి ఈ ఏడాది భోగోజు పురుషోత్తం-సముద్రమ్మ స్మారక సాహితీ పురస్కారం-2025 అందజేయనున్నట్లు వురిమళ్ల ఫౌండేషన్ వ్యవస్థాపకులు వురిమళ్ల సునంద, భోగోజు ఉపేందర్ పేర్కొన్నారు. ఖమ్మంలోని వురిమళ్ల ఫౌండేషన్ కార్యాలయంలో గురువారం వారు మీడియాతో మాట్లాడారు. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి కథల, కవితల పోటీల ఫలితాలను వెల్లడించారు. అదే సందర్భంలో ఈ ఏడాది కవి మాల్యాశ్రీకి భోగోజు పురుషోత్తం-సముద్రమ్మ స్మారక పురస్కారం-2025 అందజేయాలని నిర్వహణ కమిటీ నిర్ణయించిందన్నారు. త్వరలో జరుగబోయే ఫౌండేషన్ వార్షికోత్సవ సభలో మాల్యాశ్రీకి పురస్కారంతో పాటు పది వేల నగదు అందజేసి సత్కరించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో సాహిత్యరంగంలో విశేష కృషి చేస్తున్న సుప్రసిద్ధ కవులకు ఈ పురస్కారాన్ని ప్రతి ఏడాది అందజేస్తున్నట్లు తెలిపారు.

**వురిమళ్ల శ్రీరాములు స్మారక కథల పోటీ విజేతలు వీరే**

వురిమళ్ల శ్రీరాములు స్మారక కథల పోటీల్లో 5 వేల నగదు ప్రథమ బహుమతిని రంగనాథ్ సుదర్శన్(ఇల్లందు) రాసిన 'మైలంటని మహాలక్ష్మీ' కథ గెలుచుకుంది. 4 వేల నగదు ద్వితీయ బహుమతిని యస్వీ కృష్ణ(హైదరాబాద్) రాసిన 'ఇంధనం' కథ గెలుచుకుంది. 3 వేల నగదు తృతీయ బహుమతిని జివి హేమతల(గుంటూరు) రాసిన 'గ్రహణం ' కథ గెలుచుకుంది. వెయ్యి రూపాయల కన్సోలేషన్ బహుమతులను మంత్రి ప్రగడ శ్రీనివాసరావు(ఖమ్మం) రాసిన 'స్వీయ శిల్పి', పెమ్మరాజు విజయరామచంద్ర(హైదరాబాద్) రాసిన 'డక్కీ', ఎస్‌బిఎస్ శ్రీనివాస్ పోలిశెట్టి(కాకినాడ) రాసిన 'డెంజరస్ డెవిల్స్', నల్లబాటి రాఘవేంద్రరావు(హైదరాబాద్) రాసిన 'మొట్టమొదటి అడుగు', సయ్యద్ గఫార్(హైదరాబాద్) రాసిన 'షికార్' కథలు ఎంపికయ్యాయి.

**వురిమళ్ల పద్మజ స్మారక కవితల పోటీ విజేతలు వీరే**

వురిమళ్ల పద్మజ స్మారక కవితల పోటీల్లో 4 వేల నగదు ప్రథమ బహుమతికి చిందం రమేష్(జగిత్యాల) రాసిన 'విషాద కావ్యం' కవిత ఎంపికైంది. 3 వేల నగదు ద్వితీయ బహుమతికి పొత్తూరి సీతారామరాజు(కాకినాడ) రాసిన 'సాగనీ పయనం' కవిత ఎంపికైంది. 2 వేల నగదు తృతీయ బహుమతికి అవ్వారు శ్రీధర్‌బాబు(నెల్లూరు) రాసిన 'జూమ్ చెయ్' కవిత ఎంపికైంది. వెయ్యి రూపాయల నగదు పొందే కన్సోలేషన్ బహుమతులకు శింగరాజు శ్రీనివాసరావు(ఒంగోలు) రాసిన 'ఆరవ శక్తి', కటుకోజ్వల రమేష్(ఖమ్మం) రాసిన 'కాలధర్మం', మామిడిశెట్టి శ్రీనివాసరావు(పశ్చిమ గోదావరి) రాసిన 'మనిషతనమై మొలకెత్తి' కవితలు ఎంపికయ్యాయి. విజేతలందరికీ త్వరలో ఖమ్మంలో జరుగబోయే వార్షికోత్సవ సభలో బహుమతులను ప్రదానం చేయనున్నట్లు వురిమళ్ల సునంద, భోగోజు ఉపేందర్‌రావు తెలిపారు.

# బనకచర్ల పై సీఎం రేవంత్ వాస్తవాలు



నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కు వరద జలాలు ఎక్కడవని వింత ప్రశ్నలు. రెండు తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్ గా రాజకీయ ఎత్తుగడలతో సాగుతున్న గోదావరి బనకచర్ల పై సీఎం రేవంత్ రెడ్డి కుండ బద్దలు కొట్టే వాస్తవాలు వెల్లడించారు.2016 అపెక్స్ కౌన్సిల్ మీటింగ్ మినిట్స్ బట్ట బయలు చేసారు.మాజీ సీఎం కేసీఆర్ గోదావరి వరద జలాలు ఏటా మూడు వేల టీ ఎం సీ లు వృథాగా సముద్రంలో కలుస్తున్నాయని కేసీఆర్ ఆలోచనలతో..నాటి సీఎం చంద్రబాబు WAPCOS తో సర్వే చేయించారు.వాటర్ అండ్ పవర్ కన్సల్టెన్సీ సర్వీసెస్ దీని పూర్తి పేరు వ్యాప్ కోస్ సంస్థ కేంద్ర ప్రభుత్వం ఆదీనంలో జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నడిచే ప్రతిష్ఠాత్మక సంస్థ. 1969 లో వ్యాఫ్ కోస్ ప్రారంభమైంది.ఇంత గొప్ప సంస్థ గోదావరి వరద జలాలు 400 టీ. ఎం సీ లు ఆంధ్ర ప్రదేశ్ వినియోగం చేయొచ్చని ఇచ్చిన ఫీజ్ బులిటీ రిపోర్ట్ ను సీఎం రేవంత్ రెడ్డి ప్రెస్ మీట్ లో కుండ బద్దలు కొట్టారు. ప్రతి ఏటా వరద జలాలు సముద్రం లో కలిసేది వాస్తవం ఐనా నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ గారు వరద జలాలు ఎక్కడ అంటున్నారు.....బీ.అర్.ఎస్ ట్రాప్ లో పడొద్దు ఉత్తమ్..తెలంగాణ భవిష్యత్ లో వెయ్యి టీ.ఏం.సీ లు వినియోగించే ప్రాజెక్ట్ లు మరో 500 ఏళ్లలో కట్టినా నీటి సమస్య రాదు.సముద్రంలో కలిసే గోదావరి వరద జలాలు బనకచర్ల ప్రాజెక్ట్ తో రాయలసీమ సస్య శ్యామలం చేయడానికి సీఎం చంద్రబాబు గారి భగీరథ ప్రయత్నం పై బీ.అర్.ఎస్ పార్టీ కళ్ల మంట కు కాంగ్రెస్ సర్కార్ వత్తాసు పలకకుండా రెండు తెలుగు రాష్ట్రాలు సస్య శ్యామలం అయ్యేలా స్వాగతించాలికేంద్ర ప్రభుత్వ సంస్థ WAPCOS సర్వే కి వ్యతిరేకంగా మాట్లాడితే చరిత్ర క్షమించదురాజకీయ స్వార్థంతో బీ.అర్.ఎస్ ఇపుడు వ్యతిరేకిస్తున్నారు కానీ సముద్రం లో కలిసే గోదావరి వరద జలాలు వినియోగం పై మొట్ట మొదట సోయితో మాట్లాడిన నేత గా కేసీఆర్ నిలిచారునికర జలాలు...మిగులు జలాలు.....వరద జలాలు గూర్చి కేంద్ర జల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నడిచే వ్యాఫ్ కోస్ నివేదికలు ప్రామాణికం...రెండు తెలుగు రాష్ట్రాలు గోదావరి కృష్ణా జలాల వినియోగంలో బీ.అర్.ఎస్ స్వార్థ రాజకీయ ట్రాప్ లో పడకుండా చరిత్రలో నిలిచేలా ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి ..చంద్రబాబు అడుగులు వేయాలని బనకచర్ల కు బాటలు వేయాలని రైతాంగం పక్షాన విన్నపం.

# వైద్యులారా వందనం

**త్రివేణి పాఠశాలలో నేషనల్ డాక్టర్స్ డే వేడుకలు**



**ఖమ్మం టౌన్,03 జులై (కెరటం న్యూస్):** నేషనల్ డాక్టర్స్ డే సందర్భంగా ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్. బిదన్ చంద్ర రాయ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జాబిశెట్టి హాస్పిటల్ కి చెందిన డాక్టర్ జాబిశెట్టి గౌతమ్, ఆర్థో స్పెషలిస్ట్ గారిని మరియు సాయిరాం హాస్పిటల్ డాక్టర్ సునీల్ కుమార్ జంగాల, గ్యాస్ట్రో ఎంట్రోలాజిస్ట్ గారిని త్రివేణి యాజమాన్యం మరియు విద్యార్థులు కలసి స్వీట్స్ ఇచ్చి డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలియచేసారు. గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ మనకి ఏదైనా సమస్య వస్తే డాక్టర్ దగ్గరికి వెళ్తాం.. ప్రతి ప్రొఫెషన్‌కి ఓ టైమ్ అంటూ ఉంటుంది. కానీ, కొన్నింటికి అసలు టైమింగ్స్ ఉండవు. మనకి ఆరోగ్య సమస్యలు ఎప్పుడు ఎదురైతే అప్పుడు వెళ్తాం. అలాంటప్పుడు డాక్టర్స్ ప్రాణాలు కాపాడతారు. నిజానికి అంత కంటే ఎక్కువే చేస్తారు. వాళ్ళు పేషెంట్ మానసికస్థితిని బట్టి వ్యవహరిస్తారు. పేషెంట్ కి బాధ కలుగకుండా చేసే చికిత్సపై దృష్టి పెడతారు. రోగి త్వరగా కోలుకునేలా చేస్తారు. ఒకవేళ ఒకరికి నయం చేయలేని వ్యాధి వస్తే వారు తమ మిగిలిన జీవితాన్ని హాయిగా గడిపేందుకు కృషి చేస్తారు. అలాంటి డాక్టర్స్ కి డాక్టర్స్ డే రోజున మన కృతజ్ఞతలు తెలుపుకుందాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మానవ జీవితం అనేకమైన అనారోగ్య సమస్యల వలయంలో చిక్కుకుని సతమతమవుతున్నప్పుడు ఆ శారీరక రుగ్మతలను తగ్గించి మన ఆరోగ్యాన్ని కాపాడే వైద్యులకు మనమందరం ఎల్లప్పుడూ రుణపడి ఉండాలని, మన ఆరోగ్యాన్ని కాపాడే వైద్యులే మన పాలిటి దైవాలుగా వారిని గౌరవించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ డాక్టర్ల వేషధారణ లో రకరకాల వైద్య పరికరాలను పదర్శిస్తూ వాటి ఆవశ్యకతను తెలియచేసారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు పాఠశాల సి ఆర్ ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న, ముస్తఫా, క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్ సందీప్ మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

